గెల్వలాంబ మాత హుండీ ఆదాయం రూ. 5.75 లక్షలు 6

స్ఫూర్తిమంతమైన కవిత్వం రాయాలి 6

లెక్క పక్కా..

- పంటల వివరాల నమోదు షురూ..
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- ఈనెల చివరి నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ
- జిల్లాలో సాగు భూమి 2,24,469 ఎకరాలు



వనపర్తి శివారులో సాగుచేసిన వరి

వనపర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు వివరాలను పక్కాగా చేపట్టేందుకు ప్రభుత్వం క్రాప్ బుకింగ్ ప్రారంభించింది. ఈ నెలాఖరు వరకు సర్వే పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఏఈవోలు పంటల వివరాల నమోదు కోసం పొలం బాట పట్టారు. క్లస్టర్ పరిధిలో ఒక్కో ఏఈవో 5వేల ఎకరాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. మారుమూల గ్రామాల్లో సాంకేతిక సమస్యల దృష్ట్యా ఆన్‌లైన్‌లో ఫోన్‌ద్వారా నమోదుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

పంటల నమోదు షురూ

జిల్లా వ్యాప్తంగా 72 క్లస్టర్ల పరిధిలో 1,96,683 మంది రైతులు ఉన్నారు. వీరి పరిధిలో 2,24,469 ఎకరాల సాగు భూమి ఉంది. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. సర్వే నెంబర్లు, రైతుల వారీగా సాగు చేస్తున్న పంటల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రైతు ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేస్తున్నాడో వంటి వివరాలను అందులో పొందుపరుస్తున్నారు.

పంట విక్రయాల్లో పారదర్శకత

డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంటల విక్రయ సమయంలో పారదర్శకత ఏర్పడనుంది. వరి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు ప్రభుత్వ సంస్థల ద్వారా రైతుకు మద్దతు ధర అందుతుంది. అయితే ప్రైవేటుతో పోల్చితే ఈ ధరలో వ్యత్యాసం ఉండడంతో కొనుగోళ్లలో గోల్‌మాల్‌కు అవకాశం ఉంటుంది. దళారులు పంట దిగుబడులను రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆ పంటలను ప్రభుత్వానికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. డిజిటల్ క్రాప్ బుకింగ్ ద్వారా పంట ఏ మేరకు సాగవుతుందో రైతుల వారీగా పూర్తి వివరాలుంటాయి. తద్వారా అక్రమాలకు చెక్ పడనుంది.



నాగర్‌కర్నూల్ పట్టణంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా సర్వే అధికారి నాగేంద్రబాబు మాట్లాడుతూ 28 మంది అభ్యర్థులకు గాను 27 మంది హాజరయ్యారని తెలిపారు. అదేవిధంగా ప్లాటింగ్‌లో 96 మంది అభ్యర్థులకు గాను 95 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. పరీక్షలకు వయోజన విద్య డిప్యూటీ ఉపసంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి, పర్యవేక్షులుగా వ్యవహరించారు.

మసకబారుతున్న తెల్లబంగారం

- చెట్టుకే ముగిగిపోతున్న పత్తి కాయలు
- వర్షాలతో రంగు మారుతున్న పత్తి
- అయోమయంలో పత్తి రైతులు



అధిక వర్షాలతో చెట్టుకే నల్లగా మారిన పత్తి

తాడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జూన్ మొదటి వారం నుంచే వర్షాలు కురవడంతో పత్తి విత్తుకున్నారు. అప్పట్లో వర్షాలు కూడా అదునుమీద కురవడంతో పత్తి దిగుబడి పెరుగుతుందని రైతులు ఆశించారు. ఆ తరువాత అధిక వర్షాల కారణంగా మొక్కల గిడసబారాయి. దీంతో మొక్క ఎదుగుదల కోసం రైతులు సమయం దొరికినప్పుడల్లా ఎరువులు వేస్తూ మందులు పిచికారి చేశారు. ఇప్పటి వరకు ఎకరాకు దాదాపు రూ.40 నుంచి 50వేల దాకా పెట్టుబడి పెట్టారు. కానీ చెట్టుకు 5 నుంచి 10, 15కాయలు మాత్రమే కాయడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ఆ కాయలు కూడా చెట్టుకే ముగిగిపోతున్నాయి. మరి కొంత మంది పొలాల్లో పగిలిన పత్తి వర్షానికి రంగు మారుతోంది. పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడం మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఎకరాకు 15క్వింటాళ్లు రావాల్సిన పత్తి పంట ప్రస్తుత పరిస్థితుల్లో 2 నుంచి 5క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చే పరిస్థితులు కనబడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు సమీపంలో అధిక వర్షాలతో గిడసబారిన పత్తి పంట

అతివల ఆరోగ్య పరిరక్షణ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లతో జూమ్ మీటింగ్ పూర్తి
- వైద్యుల శిక్షణకు రంగం సిద్ధం
- 17 నుంచి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ అమలు

6

దినసరి వేతన కార్మికులను పర్మినెంట్ చేయాలి

- జీవో నెం. 64 ను నిలిపివేయాలి..
- పాత పద్ధతిలోనే వేతనాలు ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివ వర్మ డిమాండ్



కొల్లాపూర్‌లో సమ్మె చేస్తున్న దినసరి వేతన కార్మికులు

కొల్లాపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికులు ఆదివారం వసతి గృహాల ముందు సమ్మె చేశారు. ఈ సమ్మెకు ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ హాజరై మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్స్‌లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవో నెం. 64ను నిలిపివేయాలని పాత పద్ధతిలోనే కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పని భారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పూర్తి కాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలన్నారు. విద్యార్థులతో పాటు కార్మికులకు రెండు జతల యూనిఫామ్, ఐడీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు దామోదర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, వర్కర్స్ యూనియన్ నాయకుడు బాలస్వామి, రమణమ్మ, పార్వతమ్మ, శారదామని, ఉషమ్మ, రంగమ్మ, ఉషమ్మ, చెన్నమ్మ, లక్ష్మీ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాటికి తీసుకెళ్లేందుకూ కష్టాలే

- అంత్యక్రియలు చేయాలంటే వాగు దాటాల్సిందే
- 'పేట' జిల్లా ఊట్కూర్ మండలం పగిడిమారి గ్రామంలో ఘటన

7

22 నుంచి అంబాత్రయ క్షేత్రంలో..
దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు


- ఏర్పాట్లను పరిశీలించిన స్వామి ఆదివరాశ్రీ
- రోజూ అమ్మవారి ఊరేగింపు.. దర్శనం

6

గణప సముద్రం నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

- ఎకరాకు 12.60 లక్షల భూ పరిహారం
- అంగీకార పత్రాలు అందజేసిన అన్నదాతలు
- 388.03 ఎకరాల భూ సేకరణ పూర్తి...

గణప సముద్రం రిజర్వాయర్ లోపలి భాగంలో రాతి కట్టడం



6

దంచికొట్టిన వాన

- లోలెవల్ కాజ్‌వేలపై ఎక్కిపారిన వరద నీరు
- చెరువులు, కుంటల్లోకి చేరిన నీరు

తాడూరు : సిర్సవాడ వద్ద దుందుభీ నదిలోని చెక్ డ్యామ్ వద్ద ప్రవహిస్తున్న వరద





పాలమూరు పట్టణంలో రోడ్డు పక్కన సీతాఫలాలను విక్రయిస్తున్న మహిళలు



నోరూరిస్తున్న సీతాఫలం

పేదోళ్ల ఆపిల్ సీతాఫలం మార్కెట్‌లో సందడి చేస్తోంది. ఏటా వర్షాకాలంలో లభించే వీటిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రైతులు విక్రయానికి తెస్తున్నారు. అడవులు, గుట్టలు, కాలువల వెంట లభించే ఈ కాయలను సేకరించి జిల్లాలోని వివిధ మండలాల రైతులు, మహిళలు ఉపాధి పొందుతున్నారు. నగరంలోని పాత బస్టాండ్ నుంచి జిల్లా పోలీసు కార్యాలయం వరకు రహదారి పక్కన వీటిని అమ్ముతున్నారు. ప్లాస్టిక్ టబ్బులు, ట్రేలలో నాణ్యతను బట్టి రూ.300 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



విక్రయానికి ఉంచిన సీతాఫలాలు

పీహెచ్‌సీల్లో అందని కిట్లు

- ప్రతీరోజు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న బాలింతలు
- నాలుగేళ్లుగా జమకాని రూ.14 కోట్ల ప్రోత్సాహకాలు

గద్వాల క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు ఆరోగ్యకిట్ల (ఎంసీహెచ్) కొరత ఏర్పడింది. ఈ కిట్స్ కోసం బాలింతలు ప్రతీరోజు ఆసుపత్రిలకు రావడం, ఇవ్వడంలేదంటూ తిరిగి వెళ్లడం జరుగుతోంది. గత ప్రభుత్వం సర్కారు దవాఖానలలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రోత్సాహకంగా నగదు, సబ్బులు, పౌడర్‌తో కూడిన కిట్‌లను అందించేవారు. ఇటీవల ఈ పథకం అమలు కాకపోవడంతో ప్రసవాలకు వచ్చే మహిళలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

నాలుగేళ్లుగా నగదు అందడం లేదు..

జోగుళాంబ గద్వాల జిల్లాలో గర్భిణులకు, బాలింతలకు ప్రోత్సాహక నగదు నాలుగేళ్ల (2021 ఏప్రిల్ 1)గా అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా రూ.14,83,93,000 బకాయిలు ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతైనా నగదు చెల్లిస్తారని గర్భిణులు, బాలితలు ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రోత్సాహక నగదు, కిట్స్ అందించడం లేదని బాలింతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రోత్సాహక నగదు పెండింగ్‌లు ఇలా...

విడతల వారీగా	లబ్ధిదారులు	రూపాయలు
మొదటి విడత(ఏఎన్‌సీ)	15,801	4,74,03,000
రెండో విడత (డెలివరీ)	6,774	3,04,83,000
మూడో విడత (3.1/2 ఇమ్యూనైజేషన్)	13,919	2,78,38,000
నాల్గో విడత (9వ ఇమ్యూనైజేషన్)	14,223	4,26,69,000
మొత్తం	50,717	14,83,93,000



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కిట్స్ కోసం వేచి ఉన్న గర్భిణులు, బాలింతలు(ఫైల్)

పౌష్టికాహార కిట్...

గర్భిణులను పోషకాహార లోపం, రక్త హీనత నుంచి కాపాడేందుకు ప్రసవం తరువాత పౌష్టికాహార కిట్‌కూడా గతంలో ఇచ్చేవారు. ఇలా కిట్స్‌ను ఇవ్వడంతో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సమృద్ధిగా ఉండి మాతా, శిశువు ఆరోగ్యంగా ఉండేవారు. అయితే 25 రోజులుగా జోగుళాంబ గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కిట్స్ కొరత ఏర్పడింది. ఇవి వస్తాయో రావో తెలియని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించిన లబ్ధిదారులకు ఆశలు ఆవిరి అవుతున్నాయని వాపోతున్నారు.

మన జీవితాలకు ప్రాణవాయువే రాజకీయం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ స్టేట్ కన్వీనర్ విశారదన్ మహారాజ్

6

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

- జోగుళాంబ గద్వాల జిల్లా, తూర్పు గార్లపాడు శివారులో ఘటన



శివారెడ్డి (ఫైల్)

రాజోలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ యువ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ దుర్ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని తూర్పుగార్లపాడు శివారులో ఆదివారం జరిగింది. రాజోలి ఎస్‌ఐ గోకారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుమ్మలపల్లికి చెందిన శివారెడ్డి (28) కుటుంబానికి తూర్పుగార్లపాడు శివారులో పొలం ఉంది. ఆ పొలంలో సాగు చేసిన వరి చేనుకు నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం శివారెడ్డి పొలానికి వెళ్లాడు. అక్కడ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదా ఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. సమీప పొలంలోని రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకొని శివారెడ్డిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోకారి తెలిపారు.

క్రీడలకు నెలవు.. మహబూబ్‌నగర్

- రూ.16.40 కోట్లతో క్రీడామైదానాల అభివృద్ధి
- సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.10 కోట్లు
- ఇండోర్‌లో రూ.2.70 కోట్లతో సెంట్రలైజ్డ్ ఏసీ
- ఓపెన్, ఇండోర్ జిమ్‌ల నిర్మాణం



7

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... బాల్యానికి మూడుముళ్ల బంధం వద్దని, బాల్య వివాహం చేసి బాలికల భవిష్యతును నాశనం చేయొద్దని ఆయన సూచించారు. చదువుకోవాల్సిన వయసులో ఆడపిల్లలను పెళ్లి పీటలు ఎక్కించి వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని ఆయన అన్నారు. చదువుతో పాటు జీవిత పాఠాలు నేర్పకుండానే వివాహ బంధంలోకి నెట్టివేస్తున్నారని, ఆడపిల్లలను ఎప్పుడు ఇంటికి భారం అనుకోవద్దని, బాల్య వివాహాలు చేయవద్దని అన్నారు. చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్ సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు బాలల సంరక్షణకు హెల్ప్‌లైన్ నెం. 1098 అందుబాటులో ఉంటుందన్నారు. బాలికలను, మహిళలను ప్రేమ పేరుతో వేధిస్తే కేసులు నమోదు చేసి రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ అన్నారు.

గెల్వలాంబ మాత హుండీ ఆదాయం రూ. 5.75 లక్షలు


ఆలయ ఆవరణలో డబ్బులను లెక్కిస్తున్న స్థానిక నాయకులు

వంగూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గెల్వలాంబ మాత ఆలయంలో ఆదివారం నిర్వాహకులు గ్రామ పెద్దల సమక్షంలో హుండీని లెక్కించారు. గత నెలలో శ్రావణ మాసం సందర్భంగా ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా హుండీ ఆదాయం రూ.5.75 లక్షలు సమకూరింద ని ఆలయ కమిటీ ఛైర్మన్ శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో యాదగిరావు, రమేష్‌గౌడ్, సురేష్, కృష్ణయ్య, నరేందర్‌గౌడ్, జనార్దన్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

22 నుంచి అంబాత్రయ క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లను పరిశీలించిన స్వామి ఆదిపరాశ్రీ


బిజ్వార్‌లో బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న స్వామి ఆదిపరాశ్రీ

ఊట్కూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) దసరా సందర్భంగా మండలంలోని బిజ్వార్ గ్రామ అంబాత్రయ క్షేత్రంలో సెప్టెంబరు 22 నుంచి దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని క్షేత్ర వ్యవస్థాపకులు స్వామి ఆదిపరాశ్రీ తెలిపారు. ఆదివారం మండలంలోని బిజ్వార్ గ్రామ అంబాత్రయ క్షేత్రంలో ఉత్సవాల వాల్‌పోస్టర్లను భక్తులతో కలిసి విడుదల చేసిన అనంతరం భక్తుల సౌకర్యార్థం చేస్తున్న ఏర్పాట్లను ప్రత్యేకంగా దగ్గర ఉండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్రి ఉత్సవాలు 22 నుంచి అక్టోబరు 2 వరకు కొనసాగుతాయని అన్నారు. 21నుంచి దుర్గాభవాని మాలలు ప్రారంభం చేసుకోవచ్చని అన్నారు. 21న అమావాస్య మంచి రోజు దీక్ష మాలలు వేసుకునే వారు వేసుకోవచ్చని తెలిపారు. 22న గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగిస్తూ అంబాత్రాయ క్షేత్రానికి చేరుకుంటుందని తెలిపారు. రోజూ అమ్మ వారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తుందని అన్నారు. అనంతరం శతచండీహోమం నిర్వహించి, లక్ష కమలార్చన చేయడనున్నట్లు తెలిపారు. అలాగే 23న బ్రహ్మచారిని అంకరణ, బిల్వార్చన, 24న చంద్రఘంటా అలంకరణ, తులసి అర్చన, 25న కూష్మాండ అలంకరణ, కుంకుమార్చన, 26న స్కందమాత అలంకరణ, కస్తూరి అర్చన, 27న కాత్యాయని అలంకరణ, గందార్చన, 28న కాళరాత్రి అలంకరణ, పసుపు అర్చన, 29న మహంకాళి అలంకరణ, పుష్పార్చన, 30న నసిద్దిదాత్రీ అలంకరణ, సువర్ణారచన కార్యక్రమాలతో ప్రతి రోజు అమ్మ వారి ఊరేగింపు దర్శనం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా 108 అఖండ జ్యోతులు, 1108 దేవిఅష్టోత్తరాలు, 2108 దివ్యఅభిషేకాలు హారతులు ఉంటాయని అన్నారు. అలాగే విశేష జనభజనలు, నాట్యప్రదర్శనలు, నృత్యాలు, ఉంటాయని అన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రేవతి

మక్తల్‌రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలను ఆదివారం స్థానిక ఎస్ఐ రేవతి ప్రారంభించారు. ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని షూటింగ్ బాల్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. నాయకులు కోళ్ల వెంకటేష్, జిల్లా కార్యదర్శి రమేష్, పీడీలు రూప, రేణుక, లావణ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ ఎంపికలు

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌతమి పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ సెలెక్షన్స్ ఆదివారం నిర్వహించారు. జిల్లా స్థాయి షూటింగ్‌బాల్ సెలెక్షన్స్‌లో 70మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు మహబూబాబాద్ జిల్లాలో జరగనున్న 44వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ పాల్గొనేందుకు బాలబాలికల షూటింగ్‌బాల్ సెలెక్షన్స్‌ను నిర్వహించి ఎంపిక చేస్తారని జిల్లా అధ్యక్షుడు రాజగిరి మల్లేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సెలెక్ట్ అయిన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాఘవేందర్, ఆర్గనైజేషన్ కార్యదర్శులు శివలింగం, శివకుమార్, శ్రీను పాల్గొన్నారు.

'గణప సముద్రం' నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

- ఎకరాకు 12.60 లక్షల భూ పరిహారం
- స్వచ్ఛందంగా అంగీకార పత్రాలు అందజేసిన అన్నదాతలు
- 388.03 ఎకరాల భూ సేకరణ పూర్తి
- మరో 197 ఎకరాల సేకరణకు సర్వే
- త్వరలో పరిహారం అందించాలని ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి


గణప సముద్రం రిజర్వాయర్

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం గణప సముద్రం చెరువును జలాశయంగా మార్పు చేసి సుమారు 5వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రూ.47.73 కోట్లు మంజూరు చేసింది. ఇటీవల జలాశయం ముంపు బాధిత రైతులు అంగీకార పత్రాలు అందజేయడంతో రిజర్వాయర్ పనుల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి సాగునీరు అందించాలని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. సాగునీటి పారుదల శాఖ వారు జలాశయం కట్ట నిర్మాణం, కొత్త అలుగు నిర్మాణం, తూముల మరమ్మతు, కట్ట లీకేజీల మరమ్మతులకు రూ.20 కోట్లు, భూ సేకరణ నిమిత్తం రూ.27.73 కోట్లు కేటాయించారు. 0.45 టీఎంసీల నీటి సామర్థ్యంతో 2 కి.మీల పొడవు ఉండే చెరువు కట్ట అలుగు రెండు అడుగుల ఎత్తు పెంచేందుకు నిర్ణయించారు. 8 అక్టోబరు 2023లో గణప సముద్రం చెరువు కట్ట పునరుద్ధరణ కోసం వెడల్పును 10 మీటర్లు పెంచడానికి పనులు ప్రారంభించారు. ఇంతలోనే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిందనే సమాచారంతో చెరువు కట్టలపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో రీ డిజైన్ చేసి కట్ట వెడల్పును 6 మీటర్లకు తగ్గించి పనులను పునః ప్రారంభించారు. గతంలో ఉన్న గణప సముద్రం చెరువు అలుగు కంటే రెండు ఫీట్లు పెంచడం టతో గ్రామంలోకి నీరు వస్తుందని ఇళ్లు పాడైపోతాయని గ్రామస్థులు అడ్డుకోవడంతో అలుగు నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. అలుగు, తూములు, చెరువు కట్ట లీకేజీలకు మరమ్మతు చేపట్టడంతో చెరువులో భూములు కోల్పోతున్న ముంపు రైతులు పలుమార్లు పనులను అడ్డగించారు. ఈ నేపథ్యంలో అధికారులు ముంపు బాధిత రైతులతో సమావేశాలు నిర్వహించి రైతులను సముదాయించారు. ప్రభుత్వం ప్రకటించిన మొదటి గెజిట్‌లో గణప సముద్రం రిజర్వాయర్ కింద 388.03 ఎకరాల భూమి ముంపునకు గురవుతుందని, భూ సేకరణ కోసం సదరు భూమి గల 1022 మంది రైతుల వద్ద అంగీకార పత్రాలు స్వీకరించడానికి శ్రీకారం చుట్టారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు 12.60 లక్షలు చెల్లిస్తామని అధికారులు జులై, ఆగస్టు మాసాలలో 950 మంది ముంపు రైతులతో భూమి పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం పత్రాలు సేకరించి సంతకాలు తీసుకుని అవార్డు కార్యక్రమం పూర్తి చేశారు. భూ సేకరణకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియను అధికారులు పూర్తి చేస్తున్నారు. ముంపు రైతులు స్వచ్ఛందంగా జలాశయం కు భూములు ఇవ్వడానికి అంగీకారం తెలుపుతూ పత్రాలు అందజేశారు. ప్రభుత్వం అందించే భూ పరిహారం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. దీంతో జలాశయం నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి. రిజర్వాయర్‌లో ముంపునకు గురికానున్న మరో 197 ఎకరాల భూమికి సంబంధించిన సర్వేను అధికారులు పూర్తి చేశారు. రెండో విడత భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసి 60 రోజుల గడువులో రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ఫైనల్ నోటిఫికేషన్ ప్రకటించే అవకాశం ఉంది. రిజర్వాయర్ కోసం అంగీకార పత్రాలు అందజేసిన ముంపు బాధిత రైతులు భూ నష్టపరిహారం త్వరితగతిన అందజేస్తే జీవనాధారంగా మారుతుందని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

● గణప సముద్రం రిజర్వాయర్ పూర్తయితే కేఎల్ఐ జలాలతో ఖిల్లాఘణపురం, మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని కొన్ని గ్రామాల 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. తద్వారా ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది.

భూ పరిహారం వెంటనే అందించాలి



జలాశయం నిర్మాణంతో ముంపుకు గురవుతున్న భూములకు అధికారులు అంగీకార పత్రాలు తీసుకుని సంతకాలు చేయించుకున్నారు. ఆ భూములకు నష్టపరిహారం వెంటనే అందించాలి. నాకు చెరువులో ఉన్న 15 గుంటల పంట సాగు చేసే భూమిని కోల్పోయాను. భూమి పోతుందని బాధతో గత 5 సంవత్సరాలుగా పంట సాగు చేయడం లేదు. ప్రభుత్వం అందించే భూ పరిహారంతో కనీసం 100 గజాల స్థలం రావడం లేదు. నష్టపరిహారం సకాలంలో అందజేస్తే జీవనాధారం పొందే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవతో ముంపు రైతులను ఆదుకోవాలి.

- సంతోష్, బాధిత రైతు, ఖిల్లాఘణపురం

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి



గణప సముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయి అంగీకార పత్రాలు అందించిన రైతులకు బ్యాంకు ఖాతాల్లో త్వరలోనే డబ్బులు జమ కానున్నాయి. రైతులు స్వచ్ఛందంగా అంగీకర పత్రాలు అందజేయడం హర్షణీయం. జలాశయంలో 388.03 ఎకరాలకు సంబంధించి భూముల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. పీఏవో (పే అండ్ అకౌంట్ కార్యాలయం) ట్రెజరీలో బిల్లులకు టోకన్ వేసిన అనంతరం ప్రభుత్వం ఆర్థిక శాఖ ద్వారా నిధులు అందజేస్తుంది. జలాశయం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం.

- సుబ్రహ్మణ్యం, ఆర్డీవో, వనపర్తి

స్ఫూర్తిమంతమైన కవిత్వం రాయాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లోక్‌నాథ్‌రెడ్డి తదితరులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కవులు తమ కవిత్వాన్ని సమాజానికి స్ఫూర్తినిచ్చేలా రచించాలని జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జైభీమ్ సంస్థ కార్యాలయంలో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో డా. కంటే నిరంజనయ్య రచించిన కాలగమనం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ మాజీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కవులు ఈ సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తు తమ రచనల ద్వారా వ్యక్తం చేస్తారని, సమాజాన్ని చైతన్య పరిచే రచనలు రావాలని కోరారు. సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ... ఒకనాటి కవులు కల్పిత సాహిత్యంతో పాటు యదార్థ విషయాలను పాఠకులను కదిలించే కవిత్వం రావాలని ఆయన పేర్కొన్నారు. కవి డా. నిరంజనయ్య మాట్లాడుతూ... మూడు దశాబ్దాల తన జీవిత కాలంలో ఎదురైన గ్రహించిన సన్నివేశాలను అనుభవాలను కవితల్లో వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. తన రచనలకు ఎంతో మంది స్ఫూర్తిగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. అనంతరం కవి నిరంజనయ్య ను పలువురు అభిమానులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జనజ్వాల, హై కోర్టు అడ్వకేట్ పాండు, ఎంఈవోలు మద్దిలేటి, నరసింహ, జైభీం సంస్థ అధ్యక్ష కార్యదర్శులు బండారు శ్రీనివాస్, రా టంబాబు, జగదీశ్వర్, వివిధ ఉపాధ్యాయ సేవా సంఘాల నాయకులు బౌద్ధారెడ్డి, మహిపాల్ రెడ్డి, వరప్రసాద్‌రావు, గద్వాల కృష్ణ, వెంకటయ్య, సూర్య, చంద్రశేఖర్, భోజరాజు, గంధం నాగరాజు, రాజారాం ప్రకాష్, ఎద్దుల యాదగిరి, సత్యనారాయణ, కృష్ణయ్య, బైరోజు చంద్రశేఖర్, సుధాకరాచారి, గిరిరాజాచారి , కిరణ్ కుమార్, ప్రవీణ్ కుమార్, సింగోటం, పెద్ద రంగన్న, చెన్నమ్మ, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన జీవితాలకు ప్రాణవాయువే రాజకీయం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ స్టేట్ కన్వీనర్ విశారదన్ మహారాజ్


సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

వనపర్తి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తరాలుగా, యుగాలుగా అణచివేయబడిన మన జీవితాలకు ప్రాణవాయువు రాజకీయమేనని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ స్టేట్ కన్వీనర్ విశారదన్ మహారాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య కళ్యాణ మండపంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మొట్ట మొదటి ఆవిర్భావ సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజ్యం ఏ ఒక్కరి సొత్తు కాదని, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సబ్బండ కులాలకు 100 అసెంబ్లీ సీట్లను అప్పగిస్తుందన్నారు. రాబోయే తరాల తలరాతలను మార్చేది రాజకీయమేనని, అలాంటి రాజకీయ రాజ్యాన్ని చేజిక్కించుకోవడం కోసమే తెలంగాణ రాష్ట్ర సాధన పేరుతో రాజ్య సాధన చేశారని అన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన దళారులే కేసీఆర్, రేవంత్‌రెడ్డి అని, మనందరికీ శత్రువుల్లా కనిపించే బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అర్ధరాత్రి అంతా ఒక్కటై సమాలోచన చేసుకుంటారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందాల్సిన 90 శాతం సంపద, భూములు రెడ్డి, వెలమ, కమ్మ, కాపు దొరలతోనే ఉన్నాయని, అలాంటప్పుడు వారందరిని దొంగలు అనటంలో తప్పేముందన్నారు. వేలు, లక్షల ఎకరాల భూములు ఉన్నవారే తెలంగాణ ఆత్మగౌరం పేరుతో ఉద్యమం చేసి రాజ్యాన్ని వారి గుప్పిట్లో పెట్టుకున్నారని, నిజమైన ఆత్మగౌరవ పోరాటం చేయాల్సింది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలేనన్నారు. ఇప్పటికైనా సబ్బండ వర్గాల ప్రజలందరూ ఏకమై భవిష్యత్తు మన తరాల బిడ్డలకు రాజ్యం ఇవ్వకుంటే మనమే మన పిల్లలను, మన భవిష్యత్తును హత్య చేసుకున్న హంతకులమవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో మొదటి సారి రెడ్డి, వెలమ, కమ్మ, కాపులు లేని ఉద్యమం బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సాగుతుందన్నారు. సమావేశంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ మహారాజ్, సారంగి లక్ష్మీకాంత్, ప్రొఫెసర్ కుమారస్వామి, రాఘవేంద్ర, వినోద్ యాదవ్, కార్తీక్ ఏకలవ్యా, జనజ్వాల, రాజారాంప్రకాష్, గంధం నాగరాజు, శంకర్‌నాయక్, శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అతివల ఆరోగ్య పరిరక్షణ

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లకు జూమ్ మీటింగ్ పూర్తి
- డాక్టర్ల శిక్షణకు రంగం సిద్ధం
- 17 నుంచి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ అమలు


అయిజ ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన మహిళలు

అయిజ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అతివల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్నది. ఈ క్రమంలోనే ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వరకు అమలు చేసేందుకు జిల్లాలో అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

ఈ పథకంలో భాగంగా మహిళలకు ఆరోగ్యపరమైన వైద్యపరీక్షలు చేస్తారు. క్యాన్సర్, షుగర్, బీపీ, బ్రెస్ట్ పరీక్షలు చేస్తారు. అనుమానిత మహిళలకు క్షయ నిర్ధారణ పరీక్షలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాధినిర్ధారణ అయితే ప్రత్యేక కార్డులు మంజూరు చేసి వైద్యం అందిస్తారు. క్యాన్సర్ డే కేంద్రాలతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతీ సంవత్సరం సెప్టెంబరులో నిర్వహించే పోషణ్‌మాసం కార్యక్రమాన్ని కలుపుకుని అమలుచేయనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య కళాశాలల్లో పనిచేసే గైనకాలజీ, కంటి, చెవి, ముక్కు, చర్మ, గొంతు, మానసిక, దంత మహిళా వైద్యులతో పరీక్షలు చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 1 ఏరియా ఆస్పత్రి, 3 సివిల్ ఆస్పత్రులు, 1 జనరల్ ఆస్పత్రులు ఉన్నాయి. రక్తపోటుతో బాధపడుతున్న మహిళలు 20,486 ఉన్నారు. మధుమేహంతో బాధపడుతున్న మహిళలు 23,642 మంది ఉన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు 263 మంది ఉన్నట్లు వైద్య అధికారులు గుర్తించారు.

జూమ్ మీటింగ్ పూర్తి

ఈ కార్యక్రమానికి సంబంధించి ఆ శాఖ జిల్లా అధికారులు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్లతో జూమ్ మీటింగ్ శనివారం నిర్వహించారు. త్వరలో వీరికి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అమలుకు ఏర్పాట్లు చేస్తున్నాం



మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించే కార్యక్రమంపై ముందుకు సాగుతున్నాము. ఆ దిశగా అవసరమైన అన్నిఏర్పాట్లు, ప్రణాళికలు చేసి ఉంచాం. అమలుకు అవసరమైన వైద్య, సిబ్బందిని సిద్ధం చేస్తున్నాము. ఈనెల 17 నుంచి వైద్య పరీక్షలు ప్రారంబిస్తాం.

- జిల్లా వైద్యాధికారి సిద్ధప్ప

దంచికొట్టిన వాన

- లోలెవల్ కాజ్‌వేలపై ఎక్కిపారిన వరద నీరు
- చెరువులు, కుంటల్లోకి చేరిన వరద


ఆగారం , కమలోద్దిన్‌పూర్ గ్రామాల మధ్య పొంగిపొర్లుతున్న వాగు


ఉప్పునుంతల : రాకపోకలు నిలిచిపోయిన కాజ్‌వే

తాడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత బుధవారం నుంచి చిన్నపాటి వర్షం కురిసి, స్వల్పంగా వరద వచ్చినా, ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వానకు పలు ప్రాంతల్లో చెరువులు, కుంటల్లో నీరు చేరింది. కొన్ని చోట్ల కాజ్‌వేలు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా జిల్లా పరిధిలోని దుందుభీ నదీతీర మండలాల్లో కాజ్‌వేలు నిండి పారుతున్నాయి.

తాడూరు మండలంలోని యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, అల్లాపూర్, యంగంపల్లి, పొల్మూరు, గుట్టలపల్లి, మేడిపూర్, ఆకునెల్లి కుదురు, అంతారం, నాగదేవ్‌పల్లి గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గ్రామాలకు వెళ్లే ప్రధాన రహ దారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలపై వర్షపు నీరు ఎక్కిపారింది. ప్రధానంగా ఆకునెల్లికుదురు-మేడిపూర్, పొల్మూరు-గుట్టలపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఆదివారం సిర్సవాడ వద్ద దుందుభీ నది ప్రవాహం అంతకంతకు పెరిగింది. ఇప్పటికే సిర్సవాడ నుంచి కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్ మండలాలకు వెళ్లే రాకపోకలన్నీ పూర్తిగా నిలిచిపోయాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న మొల్గర కాజ్‌వే

ఉప్పునుంతల : ఉప్పునుంతల - వంగూరు పరిహద్దులోని దుందుభీ వాగుపై మొల్గర కాజ్‌వే ఉధృతంగా ప్రవహిస్తున్నది. రాకపోకలు నిలిచిపోయాయి. గత ఆగస్టులో కురిసిన వర్షాలకు కాజ్‌వే తెగిపోయి నెల రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. గత ఆదివారం అధికారులు తాత్కాలికంగా మొరం పోసి కాజ్‌వేపై రాకపోలకులను పునరుద్ధరించారు. ఆదివారం తెవారుజాము నుంచి మొల్గర కాజ్‌పై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద తగ్గే వరకు ఎవరూ ప్రయాణించవద్దని ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు.

పొంగిపొర్లిన వాగులు

తిమ్మాజీపేట : మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుంటలు, చెరువుల్లోకి వరద నీరు భారీగా చేరింది. మండలంలోని పోతిరెడ్డిపల్లి, బావాజీపల్లి, తిమ్మాజీపేట గ్రామాల సమీపంలోని వాగుల గుండా వరద నీరు ప్రవహించింది. వెంకాయపల్లి-రాంరెడ్డిపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారింది. పోతిరెడ్డిపల్లి కేఎల్ఐ కాల్వ సమీపంలో నూతనంగా వేసిన కల్వర్టు నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది.

వర్షానికి పొంగి పొర్లిన వాగులు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లి ప్రవహించాయి. మండలంలో ఆదివారం 34.3 మి.మీ వర్షపాతం నమోదయింది. మండలంలోని ఆగారం, కమలొద్దిన్‌పూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై వాగు ఆదివారం ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని మామిడిమాడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి వరద నీరు చేరింది.

మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కనే ఉన్న డ్రైనేజీలో చెత్తా చెదారం అడ్డుపడటంతో వర్షపు నీరు బస్టాండ్ ఆవరణలో నుంచి రోడ్డుపై వాగు మాదిరిగా ప్రవహించింది. బస్టాండ్ ముందు గల నవీన్ ఇంట్లోకి నీరు చేరింది. ఇంటిలోకి చేరిన వరద నీటిని కుటుంబ సభ్యులు ఎత్తిపోశారు. బస్టాండ్ ఆవరణం వర్షపు నీరు చేరడంతో జలాశయంగా మారింది.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు


నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచే కాకుండా తెలం గాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి ఈ ఆదివారం టికెట్ల ద్వారా రూ.81,910, హుండీ ద్వారా రూ.79,652, మొత్తం 1,61,562 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వరశర్మ, దేవాదాయ శాఖ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు దాటుతుండగా వ్యక్తిని ఢీకొట్టిన కారు

» అక్కడికక్కడే మృతి

» మృతదేహంతో రాస్తారోకో చేసిన గ్రామస్థులు

కల్వకుర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీ కొట్టగా అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు... తర్నికల్‌కు చెందిన కొప్పు సాయిలు(55) గ్రామంలో రోడ్డు దాటుతుండగా కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న కారు ఢీ కొనగా, అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిలుకు భార్య ఉంది.

గ్రామస్థుల ఆందోళన

తర్నికల్ గ్రామంలో రోడ్డు దాటుతుండగా ఇప్పటికే ఇద్దరు మృతి చెందారని, సాయిలు కుటుంబానికి న్యాయం చేయాలని, అండర్‌పాస్ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు ధర్నా చేశారు. ప్రభుత్వం తగిన విధంగా స్పందించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి పంపారు.

డివైడర్‌ను ఢీకొని బైకిస్టుకు తీవ్ర గాయాలు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్-కొల్లాపూర్ మధ్య జాతీయ రహదారి 167కేపై ఆదివారం రాత్రి డివైడర్‌ను బైకిస్టు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ రోడ్డు ప్రమాదం పెద్దకొత్తపల్లిలో హైవేపై జమిందార్ టీ కొట్టు ముందు జరిగింది. నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లి గ్రామానికి చెందిన సాయిలు(45)నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనం చేసుకున్నాడు. తిరిగి స్వగ్రామానికి బైకుపై నాగర్‌కర్నూల్ వైపు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం ఈ ఎన్‌టీ జయప్రకాశ్, పైలెట్ వెంకటరమణ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మహిళ అదృశ్యం : కేసు నమోదు

లింగాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తచెరువు తండా గ్రామానికి చెందిన ఆరెకంటి లక్ష్మి (45) అనే మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 12వ తేదీన తన భర్త కుర్మయ్యతో కుటుంబ విషయంలో గొడవపడ్డారు. తర్వాత కుర్మయ్య మేకలు కొట్టుకుని పొలం వద్దకు వెళ్లి సాయంత్రం తిరిగి రాగా తన భార్య ఇంట్లో కన్పించలేదు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా దొరకకపోవడంతో ఆదివారం కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

మానవపాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ప్రమాదం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం మద్దూరు గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. మద్దూరుకు చెందిన పెద్దమద్దిలేటి, ఆయన మనుమడు పవన్‌కుమార్ బైక్‌పై మందుల కోసం ఇంటి నుంచి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో పెద్ద మద్దిలేటికి, పవన్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలియడతోట మానవపాడు 108వాహనం ఘటనా స్థలానికి చేరుకుంది. ఈఎంటీ రేణుక వారికి చికిత్స అందించారు. అనంతరం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

కాటికి తీసుకెళ్లేందుకూ కష్టాలే

» అంత్యక్రియలు చేయాలంటే వాగు దాటాల్సిందే

» శ్మశానవాటికకు సరైన దారి లేక అవస్థలు

» పాడెమోస్తూ అలుగు దాటిన కుటుంబ సభ్యులు



వాగులో పాడె మోస్తూ నర్సిములు మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

ఊట్కూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మరణించిన వారి అంతిమ యాత్ర అయినా, కాటికి చేర్చాలన్నా చనిపోయిన వారి బంధువులు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కావు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం పగిడిమారి గ్రామంలో నర్సిములు(50), అశ్విని(13)అనే ఇద్దరితో పాటు మరో ఒకరు శనివారం చనిపోయారు. వారిని గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో వెనుక భాగంలో ఉన్న శ్మశానవాకిటికి తీసుకెళ్లాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి. దీంతో వచ్చిన వారు సైతం వాగు వరకే రావడంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేయడానికి మోకాళ్ల లోతులో నీరు ప్రవహిస్తున్న వాగులో పాడెను మోస్తూ దాటి.. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన దహనవాటిక దూరంగా ఉండటంతో గ్రామంలోని అంజనేయస్వామి వెనుకభాగంలో ఉన్న పాత శ్మశానవాటికలో ప్రజలు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ శ్మశాన వాటికికకు సరైన దారి లేకపోవడంతో చనిపోయిన వారిని తీసుకెళ్లడానికి కష్టాలు పడాల్సి వస్తున్నదని గ్రామస్థులు వాపోయారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు సైతం శ్మశాన వాటికకు నేటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంపై మాట్లాడుకోవడం కనిపించింది. ఇప్పటికైనా అధికారులు పాత శ్మశాన వాటికకు రోడ్డు వసతి కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సాయుధ పోరాట త్యాగాలు చిరస్మరణీయం

» తెలంగాణ సాహితీ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఖాజామైనుద్దీన్

» జిల్లా కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాటం సమాలోచన కార్యక్రమం



ఉమ్మడి జిల్లా కవులు, రచయితల డైరీని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహితీ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాటయోధుల పోరాటం చిరస్మరణీయమని తెలంగాణ సాహితీ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఖాజామైనుద్దీన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ సాహితీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట కాలం నాటి సాహిత్య సమాలోచన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వి.భానుచందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొదటగా తెలంగాణ సాయధ పోరాటయోధులు రావి నారాయణరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, బద్దం ఎల్లారెడ్డి, మాకినేని, ఆరుట్ల కమలాదేవి, ఐలమ్మ, మల్లు స్వరాజ్యంలకు నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ప్రజలను మమేకం చేసి సమాజ అభివృద్ధికి, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లిందని చెప్పారు. అనంతరం ఉమ్మడి జిల్లా కవులు, రచయితల డైరీని ఆవిష్కరించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో పురస్కారాలు పొందిన పద్మాలయ, ముచ్చర్ల దినకర్, రఘురాములుగౌడ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మణాచారి, వెంకటేష్, కల్వకోలు మద్దిలేటి, వహీద్‌ఖాన్, కృష్ణయ్యగౌడ్, ఆర్.సత్యం, నర్సింహారెడ్డి, డి.రాములు, మోతీరాం పవార్, రామ్ పెరుమాళ్ల, మద్దిలేటి, జానయ్య, తిరుపతయ్య, లక్ష్మయ్య, విష్ణుమూర్తి, లక్ష్మణ్‌నాయక్, ఖాజా, గౌస్ పాషా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు నెలవు.. మహబూబ్‌నగర్

» రూ.16.40 కోట్లతో క్రీడామైదానాల అభివృద్ధి

» సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.10 కోట్లు

» ఇండోర్‌లో రూ.2.70 కోట్లతో సెంట్రలైజ్డ్ ఏసీ

» ఓపెన్, ఇండోర్ జిమ్‌ల నిర్మాణం



పీయూ సింథటిక్ ట్రాక్‌పై ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో చిరుతల్లా పరుగెడుతున్న క్రీడాకారులు(ఫైల్)

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రీడా రంగానికి బాటలు వేగంగా పడుతున్నాయి. రూ.16.40 కోట్లతో క్రీడాభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇటీవలే జీవో విడుదల చేసింది. రూ.2.70 కోట్లతో ఇండోర్‌స్టేడియంలో ఏసీ, రూ.51 లక్షలతో ఇండోర్‌జిమ్, రూ.45 లక్షలతో స్కేటింగ్ రింగ్, రూ.32 లక్షలతో వాలీబాల్ బాలికల హాస్టల్ నిర్మాణ పనులు, రూ.72 లక్షలతో స్టేడియం నిర్మాణ పనులు చేపట్టనున్నారు. మహబూబ్‌నగర్ నియోజవర్గంలో రూ.కోటితో 4 ఓపెన్ జిమ్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. వాలీబాల్ క్రీడాకారులు ఎదురుచూస్తున్న రాష్ట్రవాలీబాల్ అకాడమీ అందుబాటులోకి వచ్చింది. ప్రధాన స్టేడియంలో క్రీడాకారులకు అన్ని క్రీడా సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. రూ.6.99 కోట్లతో స్టేడియం మైదానంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం మైదానం 2024లో అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే క్రీడాపాలసీ అమలుతో పాటు రెండేళ్లలో క్రీడలకు రూ.850 కోట్ల బడ్జెట్ కేటాయించారు.



పీయూలో ఏర్పాటు చేసిన సింథటిక్‌ట్రాక్

రూ.10.70 కోట్లతో సింథటిక్ ట్రాక్

మహబూబ్‌నగర్ డీఎస్‌ఏ మైదానంలో రూ.10.70 కోట్లతో 400 మీటర్ల, ఆరు వరుసల సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటైతే ఔత్సాహిక క్రీడాకారులకు ఎన్నో మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి.

దీంతో పాటు జాతీయస్థాయి పోటీలు జరిగే అవకాశం ఉంటుంది. రాష్ట్ర అథ్లెటిక్స్ అకాడమీ ఏర్పాటు అవకాశం ఉంటుంది. ఇప్పటికే పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ అందుబాటులోకి వచ్చింది.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం...



మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. క్రీడాభివృద్ధికి రూ.16.40 కోట్లు మంజూరయ్యాయి. సింథటిక్ ట్రాక్, ఇండోర్‌లో సెంట్రలైజ్ ఏసీ, ఇండోర్‌జిమ్, స్కేటింగ్ రింగ్ ఏర్పాటుతో పాటు నియోజవర్గంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తాం. మరో క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుంది.

- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే

జిల్లాలో క్రీడాభివృద్ధి..



సీఎం రేవంత్‌రెడ్డి, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేనారెడ్డి జిల్లాకు చెందిన వారు కావటం మన అదృష్టం. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్రికెట్ క్రీడాకారుడు, వీరి సహకారంతో జిల్లాలో క్రీడాభివృద్ధి జరుగుతుంది.

- ఎన్పీ వెంకటేశ్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు

ప్రజాప్రతినిధుల కృషి వల్లే..



మహబూబ్‌నగర్ నియోజవర్గంలో క్రీడాభివృద్ధి రూ.16.40 కోట్ల నిధులకు సంబంధించి జీవో వచ్చింది. ఇందుకు ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

-ఎస్. శ్రీనివాస్. డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి..



ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికే స్టేడియంలో ఎన్నో క్రీడావసతులు ఉన్నాయి. ఇక్కడ సింథటిక్ ట్రాక్ లేక జిల్లా అథ్లెట్లు హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాక్ ఏర్పాటుకు కృషి చేయాలి. జీవో రావటం సంతోషంగా ఉంది.

-శరత్‌చంద్ర, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

అభివృద్ధే నా ధ్యేయం

» గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే తన ధ్యేయం అని, నియోజకవర్గ ప్రజలే తనకు ముఖ్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల కోసం తగ్గేదేలేదని తెలిపారు. గత ఏడేళ్లలో తాను సాధించిన ప్రగతి వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రానికి నర్సింగ్ కళాశాలను తీసుకురావడంతో నాలుగు సంవత్సరాలుగా తరగతులు కొనసాగుతున్నాయని, రూ.34.2 కోట్లతో భవన నిర్మాణం చివరి దశలో ఉన్నదని, మెడికల్ కళాశాలను తెచ్చామని, రూ.128 కోట్లతో బిల్డింగ్ నిర్మాణంలో ఉన్నదని, క్రిటికల్ కేర్ భవన నిర్మాణం కోసం రూ.23.75 కోట్లు మంజూరు కాగా తరగతులు కొనసాగుతున్నాయని తెలిపారు. సెంట్రల్ మెడికల్ డ్రగ్స్ స్టోర్ నిర్మాణం కోసం రూ.3.6 కోట్లు మంజూరు కాగా భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నదని, వీటితో పాటు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 2.3 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ రూ.12 కోట్లతో నిర్మాణం పూర్తయ్యిందని, నూతన బస్టాండ్ రూ.6 కోట్లతో నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఇండోర్ ఆడిటోరియం రూ.6.25 కోట్లతో నిర్మాణం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, గద్వాల పట్టణంలోని సంగాల చెన్నకేశవ పార్క్ రూ.1.75 కోట్లతో సుందరీకరణ చేపట్టామని తెలిపారు. 300 పడకల ఆసుపత్రి రూ.39.8 కోట్లతో నిర్మాణం పూర్తి చేయించామని, ఇందులో ప్రస్తుతం మెడికల్ కళాశాల కొనసాగుతున్నదని, జూరాల డ్యామ్ దగ్గర కొత్త బ్రిడ్జి నిర్మాణం కొరకు ఇటీవలే రూ.120 కోట్లు నిధుల జీవో జారీ చేశారని తెలిపారు. జూరాల ప్రాజెక్టు వద్ద బృందావన్ గార్డెన్ రూ.15 కోట్లతో నిర్మాణం, జిల్లా మహిళా సమాఖ్య భవనం రూ.5 కోట్లతో, బీసీ స్టడీసర్కిల్ భవనానికి రూ.3కోట్లు మంజూరు చేయించామని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గద్వాల నియోజకవర్గానికి సంబంధించి ప్రతీ గ్రామానికి కమ్యూనిటీ హాళ్లను రూ.45.20 కోట్ల వ్యయంతో నిర్మించామని తెలిపారు. గట్టు ఎత్తిపోతల పథకం ద్వారా 33,000 ఎకరాల సాగునీరు అందించే లక్ష్యంతో రూ.581 కోట్లతో పనులు జరుగుతున్నాయని, కేసీఆర్ క్యాంటీన్ ద్వారా నాలుగేళ్లుగా రోజుకు 500 మందికి భోజనాలు అందిస్తున్నామని తెలిపారు. రూ.50లక్షలతో పలు గ్రామాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించామని, ఈ అభివృద్ధి పనులు కేవలం కొన్ని మచ్చుకు మాత్రమే అని, ఇంకా చాలా అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవాలి

» జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్

» ఉత్సాహంగా జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు



కబడ్డీ క్రీడాకారులతో జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా ముక్పాల్‌లో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించి, మాట్లాడారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది క్రీడాకారులు కబడ్డీలో జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ బాలురు 18, బాలికలు 18 మొత్తం 36 మంది ప్రాబబుల్స్ ఎంపిక చేసినట్లు తెలిపారు. శిక్షణ శిబిరం నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శాంతికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, రాములు, రామచంద్రయ్య, ముత్యం, శ్రీహరి, ఉమామహేశ్వర్‌రెడ్డి, తిరుపతయ్య, నర్సింహులు, బాల రాజయ్య, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, గణేష్, మల్లేష్, మహేష్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల సందర్శనకు నారాయణపేట ఉపాధ్యాయులు



సూలూరుపేట చెంగలమ్మ ఆలయం వద్ద ఉపాధ్యాయులు

నారాయణపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సైన్స్ ఫోరం నారాయణపేట జిల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శని, ఆదివారాల్లో వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. సూళ్లూరుపేట చెంగాలమ్మ పరమేశ్వరి ఆలయం, దక్షిణ భారతదేశంలో ఉన్న ఆలయాల్లో కడప జిల్లాలో నందలూరులో ఉన్న సౌమ్యనాథ ఆలయం, ఒంటిమిట్ట, మహానంది పుణ్యక్షేత్రాలను ఉపాధ్యాయులు సందర్శించారు. సీవీ రామన్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు కనకప్ప, సెక్రటరీ రాములు, నాగార్జున రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి హెచ్.భాను ప్రకాష్, సంగం నాయకులు జనార్ధన్‌రెడ్డి, షేర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు వార్ల మల్లేష్, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్, హరి గోవింద్ సక్సేన, సంజీవరెడ్డి, పల్లెర్ల నరేష్, జయ ప్రకాష్ నాయక్, తిరుపతి నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, తిప్పన్న, రాజు నాయక్, వెంకట్ రాములు, కుక్కల శ్రీనివాస్, శ్రీదేవి, శైలజ, భాను కుమారి, పరమేశ్వరి, స్వప్న, నర్మదా , శ్రీదేవి, నిర్మల, శశిరేఖ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మతి పత్రాలు అందిస్తున్న భూ నిర్వాసిత రైతులు

» ఆదివారం సెలవు రోజైనా తెరిచిన తహసీల్

» గ్రామాలను సందర్శించిన రెవెన్యూ అధికారులు



పేట మండలం పేరపళ్లలో రైతుల నుంచి సంతకాలు స్వీరిస్తున్న రెవెన్యూ అధికారులు, భూనిర్వాసితుల సంఘం నాయకులు

నారాయణపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో పరిహారం రూ.20 లక్షలకు సమ్మతిస్తూ ప్రభుత్వ ఫార్మెట్‌లో భూనిర్వాసిత రైతుల నుంచి రెవెన్యూ అధికారులు సమ్మతి పత్రాలపై సంతకాలు స్వీకరిస్తున్నారు. అందులో భాగంగానే కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ రెవెన్యూ కలెక్టర్ శ్రీను, ఆర్డీఓ రాంచందర్ ఆదేశాల మేరకు ఆదివారం సెలవు రోజు అయినా మక్తల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద తహసీల్దార్ కార్యాలయాలు తెరిచి విధుల్లో సిబ్బంది కానవచ్చారు. రైతుల నుంచి సమ్మతి పత్రాలపై సంతకాలు సేకరించారు. పేట తహసీల్దార్ అమరేందర్ కృష్ణ నారాయణ పేట మండలం పేరపళ్ల గ్రామాన్ని సందర్శించి భూనిర్వాసితరైతుల నుంచి సంతకాలు స్వీకరించారు.

జాతీయ స్థాయి కరాటేలో ప్రతిభ

» బంగారు పతకాలు సాధించిన నారాయణపేట విద్యార్థులు



కరాటేలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. ముంబై భీవండిలో బ్రేవ్ యూత్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఆర్గనైజర్ రాజారామ్ దేవసాని, అశోక్ దేవసానిల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపారు. నారాయణపేటకు చెందిన మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సీనియర్ మాస్టర్ అశోక్‌తో శిక్షణ పొందుతున్న విద్యార్థులు కటాస్, కుమిటీ విభాగాలలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. బాలికల అండర్-12 కటాస్ విభాగంలో ఆరాధ్య, అండర్-8 విభాగంలో భువనేష్, అండర్-14లో కార్తీక్, అండర్-12లో భాను, అండర్-14 విభాగంలో శివశంకర్‌లు ఈ పతకాలు సాధించిన వారిలో ఉన్నారు. ఈ పతకాలు సాధించిన విద్యార్థులను అకాడమీ ఫౌండర్ కేశవ్‌గౌడ్, మాస్టర్స్ వీరాచారి, అశోక్, నగేష్ మల్లూరి, రూపస్‌పాల్, బాలప్రసాద్, అనిల్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు వెంటనే
నష్టపరిహారం చెల్లించాలి



దీక్షలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు

కోడేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భూ నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఏదుల రిజర్వాయర్‌లో భాగంగా భూములు కోల్పోయిన తీగలపల్లి చేస్తున్న రిలే నిరాహార దీక్షలను సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 14వ రోజుకు చేరుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల కు చీమకుట్టినట్లు కూడా కావడం లేదని పేర్కొన్నారు. మొండి వైఖరి వీడి రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల మండల కార్యదర్శి తప్పెట కిరణ్‌కుమార్, రైతులు భూనిర్వాసిత కమిటీ కార్యదర్శి ఇండ్ల చంద్రశేఖర్, స్వామి, జనముని రాములు, దేవరపాగ లక్ష్మయ్య, జెట్టి బొందయ్య, కాళ్ల గోపాల్ పాల్గొన్నారు.

తల్లిని చంపిన కేసులో కొడుకు, కోడలు అరెస్టు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తల్లిని గొంతు నులిమి హత్య చేసిన సంఘటనలో కొడుకు, కోడలును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామంలో దాసర్ల అలివేలును శుక్రవారం రాత్రి కొడుకు శివ గొంతు నులిమి హత్య చేశాడు. ఈ సంఘటనలో కోడలు పద్మ భర్త శివకు సహకరించిందని, ఇద్దరినీ అరెస్టు చేసి విచారించడంతో వారు హత్య చేసినట్లు ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- రాజేందర్, ఎస్ఐ, బల్మూరు



బల్మూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బల్మూరు ఎస్ఐ ఏ రాజేందర్ అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

మద్యం తాగి వాహనాలు నడిపిన వారు ఎంతటి వారైనా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం. ఇటీవల కాలంలో మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానాలు కూడా వేశాం.

నెంబరు ప్లేట్ లేని వాహనాలపై ఎలాంటి చర్యలు ఉంటాయి?

ప్రతీ వాహనదారుడు కచ్చితంగా తమ వాహనాలకు నెంబరు ప్లేటు తీసుకోవాలి. లేనియెడల రోడ్లపైకి వాహనాలు వస్తే సీజ్ చేసి నెంబరు ప్లేటు అమర్చే వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచుతాం

మైనర్లు వాహనాలు నడిపితే ఎలాంటి చర్యలు ఉంటాయి ?

మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేసి జైలుకుపంపుతాం. మైనర్లకు ఎవరు వాహనాలు ఇవ్వవద్దు. వారి కుటుంబ సభ్యులు కూడా బాధ్యులు అవుతారు.

హెల్మెట్ నిబంధన ఎంత వరకు అమలు చేస్తున్నారు?

ద్విచక్ర వాహనదారుడు ఇంటి నుంచి బయటకు వస్తే ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలి. లేనియెడల పెనాల్టీ వేస్తూ రెండవసారి హెల్మెట్ ధరించకుండా పట్టుబడితే కేసు నమోదు చేస్తాం. వాహనదారుడు కచ్చితంగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలి. కారు నడిపే వాహనదారుడు బెల్టు సీటును కచ్చితంగా ధరించాలి.

న్యూస్ బాక్స్

శ్రీశ్రీ కళావేదిక సాహితీ కిరీటి పురస్కారానికి కౌటిళ్య ఎంపిక



బిజినేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఈ నెల 28న శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో సైన్స్ ఫిక్షన్ రచయిత, కవి డాక్టర్ ప్రతాప్ కౌటిళ్యను శ్రీశ్రీ కళావేదిక సాహితీ కిరీటి పురస్కారానికి సంస్థ జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం, మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ కుమార్‌లు ఎంపిక చేసి, ఆదివారం సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవం, తెలుగు సాహిత్యం, తెలుగు కళల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక తన అక్షర సేవలను, సాహిత్య, సాంస్కృతిక తపనను, సృజనాత్మకతను గుర్తించి పురస్కారం అందిస్తున్న నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మామిళ్లపల్లి ఆలయంలో ఉట్ల ఉత్సవం

ఉప్పునుంతల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మామిళ్లపల్లి ఆలయంలో వైష్ణవ కృష్ణ అష్టమి, నవమి సందర్భంగా సోమవారం ఆలయం ఆవరణలో సాయంత్రం 5గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ వేముల నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి అత్యధిక భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు 15, 16న స్పాట్ అడ్మిషన్లు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి అవకాశంగా కల్పిస్తున్న ఈ ప్రవేశాలను ఇప్పటి వరకు ప్రవేశంపొందని విద్యార్థులు ఈ ప్రక్రియ ద్వారా నేరుగా కళాశాలలో చేరవచ్చని తెలిపారు. జిల్లాలోని ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలను సంప్రదించి, ప్రవేశాలు పొందాలని ఆయన సూచించారు.

నానో యూరియాతో ఎన్నో ప్రయోజనాలు

- వ్యవసాయ విస్తరణాధికారి సాయిరాం

తిమ్మాజిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు నానో యూరియా వాడకం ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయ విస్తరణాధికారి సాయిరాం అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఘన రూప యూరియా కోసం రైతులు గంటల తరబడి వరుసలో నిలుస్తున్నారని, ద్రవరూపంలోని నానో యూరియా వైపు చూడడం లేదన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి నానోయూరియా వాడాలని సూచిస్తున్నా రైతులు ముందుకు రావడంలేదన్నారు. రైతులునానో యూరియా వాడకంపై ఆసక్తి చూపాలని కోరారు.

నల్లమల అభివృద్ధికి కృషి

- ఫారెస్ట్ డివిజనల్ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నూతనంగా నిర్మించిన ఫారెస్టు డివిజనల్ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. డీఎఫ్‌వో రోహిత్ గోపిడి ఎమ్మెల్యేకు మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని హగులతో భవనాన్ని నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నల్లమల ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. టూరిజం హబ్‌గా మార్చేందుకు పక్కాప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

అమరేశ్వర దేవస్థాన అభివృద్ధికి కృషి

అమ్రాబాద్ : మండల కేంద్రంలోని అమరేశ్వర దేవస్థానం అభివృద్ధి కమిటీకి అన్ని విధాలుగా కృషి చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయలో కలిసి దేవీ నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేయించి ఆహ్వానపత్రికను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ఆవరణలో హైమాస్టు లైట్లు తక్షణమే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నవరాత్రి ఉత్సవాలకు వచ్చేటప్పుడు ఆలయ అభివృద్ధి కోసం రూ.10లక్షల ప్రొసీడింగ్ తీసుకొస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమరేశ్వర ఆలయ కమిటీ తిప్పర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గోలి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి యుగంధర్‌గౌడ్, కోశాధికారి సురేష్‌గౌడ్, ప్రచార కార్యదర్శి రాజుపటేల్, కాంగ్రెస్ నేతలు బాల్ లింగంగౌడ్, లక్ష్మణాచారి, వెంకటేశ్వర్లు, కోటి పాల్గొన్నారు.



భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఫారెస్టు అధికారులు

అభయుడిని దర్శించుకున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

ఊర్కొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారిని ఆదివారం కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి కటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ చరిత్రను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి డీఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దార బంగారయ్య, రమేష్ అర్చకులు దత్తాత్రేయశర్మ, ప్రవీణ్‌శర్మ, మహేష్‌శర్మ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

ఉపాధ్యాయుడు మహిపాల్‌నాయక్‌కు ఘన సన్మానం

- లయన్స్ ఇంటర్నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక



లయన్స్ ఇంటర్నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా సన్మానం పొందిన హెచ్‌ఎం మహిపాల్ నాయక్

చారకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుర్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యా యుడిగా విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం మహిపాల్‌నాయక్ లయన్స్ ఇంటర్నేషనల్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలోని అన్నపూర్ణ గార్డెన్‌లో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులను లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ పురస్కారాలు అందజేశారు. హెచ్‌ఎం మహిపాల్ నాయక్‌ను లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ మహేందర్‌రెడ్డి శాలువాతో సన్మానించి, ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. మండలంలోని ఉపాధ్యాయులు కూడా మహిపాల్‌నాయక్‌ను అభినందించారు.

అయ్యప్ప స్వామి మాలధారుల ఇరుముడులు

తెలకపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : 45 రోజులు భక్తి శ్రద్ధలతో దీక్ష చేపట్టిన అయ్యప్పస్వామి మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఆదివారం మండల కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వైభవంగా నిర్వహించినట్లు గురు స్వాములు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి మాలదారులకు జూపల్లి మాధవి మోహన్‌రావు మాలధారులకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇరుముడుల అనంతరం మాలధారులను మండల కేంద్రంలోని పురవీధుల గుండా భజనలతో ఊరేగించారు. అనంతరం మాలధారులు అయ్యప్ప స్వామి దేవాలయ సన్నిధికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారుల కుటుంబ సభ్యులు, బంధువులు, భక్తులు పాల్గొన్నారు.




అయ్యప్ప మాలధారులకు భిక్ష అందజేస్తున్న దాత జూపల్లి మాధవీమోహన్‌రావు

నేడు రెవెన్యూ కార్యాలయం ముట్టడి : ఎమ్మార్పీఎస్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, ఒంటరి మహిళలు పింఛన్లు పెంచాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పెద్దకొత్తపల్లి మండల రెవెన్యూ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి పెన్షన్‌దారులు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రాజమౌళి మాదిగ కోరారు. ఆదివారం పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పెన్షన్‌దారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పింఛన్‌దారులకు ఇచ్చిన హామీ నెరవేర్చనందుకు మందకృష్ణ మాదిగ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి దిగారని అన్నారు. పోరాటంలో భాగంగా సోమవారం మండల కార్యాలయ ముట్టడి నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పెంచుతామన్న పెన్షన్లు పెంచకుండా మోసం చేసిన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బుడగ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు గడ్డం యాదగిరి, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

పెంట్లవెల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవురాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇల్లు లేని నిరుపేదల ఇంటికి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెంట్లవెల్లిలో ఎంతో మంది ఇళ్లులేని పేదలు ఉన్నారన్నారు. అర్హులైన ప్రతీ ఒకరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఎంతో మంది ఇప్పటికి పూరి గుడిసెలోనే జీవనం కొనసాగిస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నాయకులు యగౌను, బిచ్చన్న పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో పరిశీలిస్తున్న గోవురాజు

ఆక్రమణకు గురవుతున్న ఊరకుంట

- కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

వంగూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనేటిపూర్ ఊరకుంట అక్రమణకు గురవుతుంది. రికార్డు ప్రకారం సర్వే నెం. 32లో 10ఎకరాల 23 కుంటల భూమి ఉంది. చుట్టుపక్కల భూములు ఉన్న వారు ఊరకుంట లోపలి వరకు కంచే వేసి ఆక్రమించుకున్నారు. ఊరకుంట భూమిని ఆక్రమించుకోవడం వల్ల విస్తీర్ణం తగ్గిపోయి నీరు ఉండటం లేదు. దీంతో ఏడాది కాలంపాటు కుంటలో ఉండాల్సిన నీరు మూడునెలల్లోనే ఖాళీ అవుతున్నాయి. ఊరకుంట ఆక్రమణపై ఇటీవలనే కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి ఆక్రమణకు గురవుతున్న ఊరకుంట భూమిని కాపాడి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



భూమిని ఆక్రమించి కంచే ఏర్పాటు చేసి సాగు చేసిన పంట

సీతారామచంద్ర స్వామి మాస కల్యాణం

చారకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరసనగండ్ల పంచాయతీలోని అయోధ్యనగర్‌లో ఏకశిలపై రెండో అపర భద్రాద్రిగా వెలిసిన సీతారామచంద్రస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఆలయ ఈవో స్వర్గం ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ అర్చకులు సీతారాముల మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన రంగినేని విజయమనోహర్‌రావు, సంధ్యారాణి దంపతులు, హైదరాబాద్‌కు చెందిన దుర్శనపల్లి ప్రీతం, కావ్య దంపతులు స్వామి వారి మాస కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకులు డేరం మురళీధర్ శర్మ, డేరం లక్ష్మణశర్మ డేరం అనంతరామశర్మ, డేరం కోదండరామశర్మలు స్వామి వారికి అలంకరణ, తులసీనామర్చన, అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించు తమ మొక్కులు చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నిరంజన్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు



హైకోర్టు జడ్జిని కలిసిన కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు

కల్వకుర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి, నూతన కోర్టు బిల్డింగ్ కమిటీ సభ్యుడు విజయసేనారెడ్డిని కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. హైదరాబాద్‌లోని హైకోర్టులో ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కల్వకుర్తి కోర్టుకు నూతన భవనం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. జస్టిస్ విజయసే నారెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. విజయసేనారెడ్డిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేష్, న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేష్ ఉన్నారు.


వంతెన నిర్మాణానికి మట్టి నమూనా సేకరణ



ఐతోల్ గ్రామ సమీపంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

తాడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐతోల్ గ్రామంలో నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే ఇటీవల కొనసాగుతున్న వరద ప్రవాహానికి పూర్తిగా దెబ్బతినింది. దీంతో వర్షం కురిసినపుడల్లా కాజ్‌వే పై నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో తరచూ రాకపోకలు నిలిచిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు నూతన వంతెన నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. శనివారం కాజ్‌వే సమీపంలో బోర్‌వెల్ ద్వారా మట్టి నమూనాలను సిబ్బంది సేకరిస్తున్నారు. అధికారులు త్వరగా వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఐతోల్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ హిందీ భాషా దినోత్సవం



హిందీ భాషా ప్రాధాన్యతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

వెల్దండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హిందీ భాషా ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. దేశ ప్రజలను ఏకం చేసి ఏకతాటిపై నడిపిన భాషా కేవలం హిందీయేనని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కోడం భాస్కర్, ఉపాధ్యాయులు ప్రవీన్, సోను, ధర్మేందర్, చంద్రబాబు, ప్రియ, కవిత ఉన్నారు.

విసుగు చెందే మా పార్టీలో చేరుతున్నారు

- కాంగ్రెస్ నాయకుల చేరికపై మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



ఎర్రన్నబావితండాలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోడేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పాలనపై విసుగు చెంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రన్న బావితండాలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను బీరం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు అక్రమ కేసులు పెట్టి బెదిరించినా, సంక్షేమ పథకాలకు ఎంపిక చేయరి తెలిసిన నిర్బంధాలు ఎదురైనా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ ఎస్ పార్టీలో చేరిన దూద్వి నాయక్, విష్ణునాయక్, శ్రీనునాయక్, శివనాయక్, అంజి నాయక్, స్వామినాయక్, వెంకటేష్ నాయక్, చందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్

కొల్లాపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇరవై, ముప్పై సంవత్సరాలుగా పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ అచ్చంపేట నియోజకవర్గాలోని మారుమూల గ్రామాలు, కృష్ణానది తీర ప్రాంతాల్లో ఎన్నోఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన, బీసీ, ఆదివారి రైతులకు ప్రభుత్వం కొంతమందికి మాత్రమే పట్టాలిచ్చి చేతులు దులుపుకుందని పేర్కొన్నారు. 15 సంవత్సరాలకుపైగా భూమి సాగు చేసుకుంటున్న ప్రతీ ఒక్క రైతుకు ప్రభుత్వం హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తుమ్మల శివుడు, ఎండీ యూసుఫ్, కిరణ్ పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



పెద్దకొత్తపల్లిలో లబ్ధిదారుడికి ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా చేపట్టి పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ అన్నారు. ఆదివారం పెద్దకొత్తపల్లి గ్రామం లో లబ్ధిదారులు మారేడు కౌసల్యకు ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. నిబంధనలకు అనుగుణంగా ఇల్లు నిర్మించుకోవాలని కోరారు. పెద్దలకు శాలువాతో సన్మానించి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ దండు చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ తలారి లక్ష్మణస్వామి, మాజీ ఎంపీటీసీ లు కన్‌రెడ్డిమాధవి, అశోక్‌రెడ్డి, శశికళ, శివ శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తగిలి బాలస్వామి, మండల మత్స్యకార సంఘం అధ్యక్షుడు గడ్డిగోపుల ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బ్యాగరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- వైద్య శిబిరంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి



మొబైల్ హెల్త్ క్యాంపులో జర్నలిస్టులకు రిపోర్టులను పంపిణీ చేస్తున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతినిత్యం ప్రజల్లో ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల్లోని జర్నలిస్టులకు ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 130 మంది జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులను, ఆర్గానిక్ హెల్త్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఆరోగ్యం ముఖ్య మనే సంకల్పంతోనే హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు రాఘువేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్ర మంలో ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, రఘు, యాదయ్య, రమేష్ నాయక్, కొండల్ యాదవ్, శ్రీపతిరాజు, శేఖర్, శ్రీను, శివ, మహేష్, కల్యాణ్, భాస్కర్ ఉన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

- ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి అని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగలను గుర్తించడం సులభతరమవుతుందని స్థానిక ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ గ్రామంలో తరచుగా దొంగతనాలు జరుగుతున్నాయని, దొంగలను గుర్తించడానికి కష్టంగా ఉందన్నారు. బావాజీపల్లిలో గ్రామస్థులకు అవగాహన కలిగించగా, సీసీ కెమెరాలు ఏర్పాటుకు చందాలు జమ చేశారని తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల అసాంఘిక కార్యక్ర మాలు జరగకుండా నివారించడం జరుగుతుందన్నారు. అందరూ బాధ్యతగా గుర్తించాలని కోరారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్‌నాయక్



ఉప్పునుంతలలోని రైతువేదిక భవనం వద్ద ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఉప్పునుంతల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని రైతువేదిక భవనంలో రెండో మహాసభలు యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ అధ్యక్షతన నిర్వహించారు. శంకర్‌నాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకివచ్చి 20నెలలు గడుస్తున్నా గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగరాజు, సైదులు, ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, సుల్తాన్, వెంకటయ్య, రాధ, సుజాత, రాములు దాసు ఉన్నారు.

మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలి

కల్వకుర్తి : గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానం జీవో నెంబరు-51ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ కల్వకుర్తి మండల మహాసభ యూనియన్ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన జరిగింది. గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, ఉపాధ్యక్షులుగా అర్జున్, బాలమైసయ్య, సహాయ కార్యదర్శులుగా సాయమ్మ, వెంకటయ్య, కోశాధికారిగా వెంకటేశ్‌తోపాటు మరో 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కళాకారుడు జగన్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.